క్లుప్తంగా

వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: డెంగీ, మలేరియా వ్యాధుల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, ఏఎంఓ వరప్రసాద్‌రెడ్డి, సబ్‌యూనిట్ సిబంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

శిరివెళ్ల: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. శనివారం డీవార్మింగ్‌పై టీచర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 19 ఏళ్ల వయస్సు వారు 11,988 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికీ 10వ తేదీన మందులను పంపిణీ చేయాలన్నారు. వంద శాతం మందికి వేయాలని ఒక వేళ మిగిలిన వారు ఉంటే 17వ తేదీన వేయాలని సూచించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, డాక్టర్లు విజయకుమార్, షబీర్‌వలి, సీహెచ్‌ఓలు రామ్మోహన్‌రెడ్డి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు కోరారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీల్లో సీట్లు పెంచి మరింత మంది పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, వారికి పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అనురాధకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనుంజయుడు, శ్రీనివాసులు, సురేష్, ఉదయ్, ప్రతాప్, ఎర్రిస్వామి, దినేష్, వీరేంద్ర, వినోద్, మనోజ్ పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

శిరివెళ్ల: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు వేతనాలు మంజూరు చేయాలని శనివారం ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ షేక్ మొయిద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు రాముడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలలో విలీనం చేసి ఎస్జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి బదిలీ చేసిందన్నారు. అయితే రెండు నెలల నుంచి వారికి వేతనాలు రాలేదన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శి నూరుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

గోస్పాడు: ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, ప్రతాపరెడ్డి కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అంజదేశారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

చాగలమర్రి: తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివని చాగలమర్రి సర్పంచ్ తులసమ్మ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక బుగ్గరస్తా వీధిలోని 5వ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమానికి ఆమే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్త యు.పద్మావతి, ఎంపీటీసీ యు.షాహిదా, వార్డు మెంబరు డి.మన్సూర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

శిరివెళ్ల: కోటపాడులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం పనుల్లో భాగంగా అంతర్గత సిమెంట్ రోడ్డు పనులకు సర్పంచు దూదేకుల ఉశేన్‌బీ శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. 8వ వార్డు బీసీ కాలనీలోని ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించగా స్థానికులు రోడ్డు సమస్యను ప్రస్తావించారు. స్పందించిన ఆయన రూ.4లక్షలు మంజూరు చేయించారు. వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, దూదేకుల గుర్రప్ప పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు

నంద్యాల(అర్బన్): ఇకపై భవన నిర్మాణాల అనుమతులు ఆన్‌లైన్‌లోనే జరగాలని డీపీఓ మంజులవాణి కుడా వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో జిల్లా స్థాయి ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంచాయతీల్లో గతంలో మ్యాన్‌వల్‌గా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేవారని, ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 300 స్క్వేర్ మీటర్లు ఉన్న బిల్డింగ్‌లకు పంచాయతీ అనుమతులు ఇవ్వవచ్చని, 300 దాటితే కుడా ద్వారా అనుమతులు పొందాలని సూచించారు. కుడా ప్లానింగ్ ఆఫీసర్ సంధ్య పాల్గొన్నారు.





నాడు..రుద్రవరం సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్ట రక్షణ గోడ కూలిన దృశ్యం, నేడు.. నూతనంగా నిర్మించిన రక్షణ గోడ

'గంగ'కు గట్టి భద్రత



కాల్వ కట్టపై గ్రావెల్ తోలించి చదును చేసిన దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రం సమీపంలోనున్న తెలుగు గంగ ప్రధాన కాల్వ కట్టకు ఆ శాఖ అధికారులు గట్టి భద్రత కల్పిస్తున్నారు. కట్టకు దిగువన ఉ న్న పొలాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మతు పనులు చేపట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కాల్వ ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలైంది. అప్పటి నుంచి కాల్వ కట్టలు, కల్వర్టులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అప్పట్లో పనులు కూడా నామమాత్రంగా చేపట్టడంతో కొద్ది రోజులకే కాల్వలు పూర్వ స్థితికి చేరుకున్నాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందేది కాదు. అలాగే.. గత కొద్ది నెలల క్రితం కాల్వలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు రుద్రవరం సమీపంలో 60–62,కి.మీ మధ్య కట్ట అడుగు భాగాన లీకేజీ ఏర్పడటంతో పాటు మూడు ప్రదేశాల్లో కాల్వ కట్ట రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా మారింది. వెంటనే అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం 21వ బ్లాక్ నుంచి 35వ బ్లాక్ వరకు మరమ్మతులు చేయించేందుకు దాదాపు రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో కూలిన రక్షణ గోడ ప్రదేశంలో నూతన గోడ నిర్మించారు. అలాగే లీకేజీ లేకుండా కట్టపై గ్రావెల్ తోలించి చదును చేయించారు. లోపలి భాగంలో నుంచి నీరు బయటకు రాకుండా సైడ్ వాల్స్‌కు జాలర్ అమర్చి కాంక్రీట్ పనులు చేయించారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: అర్హులందరికీ పథకాలు అందజేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మండల అధికారులకు ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. శనివారం స్థానిక మండల సమావేశ మందిరంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఆయన ఆయా శాఖల మండల అధికారులతో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షించారు. వెలుగు సీసీ నాగరాజు మాట్లాడుతూ జగనన్న గృహనిర్మాణాలకు సంబంధించి పొదుపు గ్రూపు సభ్యులకు రూ.35,000 ప్రకారం మండలంలో ఇప్పటి వరకు 185 మందికి మంజూరైనట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ కొండారెడ్డి మాట్లాడుతూ మండలంలో 17 సచివాలయ భవనాలు మంజూరయ్యాయని వాటిలో 7 పూర్తయ్యాయని, 3 భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, గొడిగనూరు, చిన్నవంగలి, చాగలమర్రి గ్రామాల్లో 3 సచివాలయ భవనాలు రద్దయ్యాయని వివరించారు. డి.కొత్తపల్లె గ్రామ సర్పంచ్ బాలీశ్వరరెడ్డి మాట్లాడుతూ డి.వనిపెంట గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు లేక గ్రామం మురుగు కూపంగా మారిందని, జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ఏఈ కొండారెడ్డికి గ్రామ ప్రజలు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని సభ దృష్టికి తెచ్చారు. ఆర్అండ్‌బీ ఏఈ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ చాగలమర్రి నుంచి నర్సాపురం వరకు రెండు లైన్ల రోడ్డు నిర్మాణం, ఒక పిహెచ్‌సీ కూడా మంజూరైందని, అలాగే శెట్టివీడు, ముత్యాలపాడు గ్రామ సమీపంలో రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టామన్నారు. వైద్యాధికారి షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ చాగలమర్రిలో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి ముగ్గురిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామన్నారు.సమావేశంలో వైస్ ఎంపీపీపి ముల్లా రఫీ, ఎంపీటీసీలు ఎం.ఫయాజ్, కె.లక్ష్మీరెడ్డి, వెంకటరాముడు, నరసింహ్ముడు, వై. వెంకటలక్ష్మీ, షాహీదా, బేబమ్మ, ఎం.షంషాద్, ఎంఈఓ అనురాధ, తహసీల్దారు సుభద్రమ్మ, ఈఓపీఆర్‌డి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి అంచనాల్లో కచ్చితత్వం ఉండాలి

నంద్యాల(సెంట్రల్): పంట కోత ప్రయోగాల సమయంలో వ్యవసాయ సిబ్బంది దిగుబడులను కచ్చితంగా అంచనా వేసి ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్య ప్రణాళికా అధికారి జే.వేణుగోపాల్ సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ భవనంలో జిల్లా స్థాయి పంట కోత ప్రయోగాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్,రబీకి సంబంధించి 1,498 ప్రయోగాలకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సహాయ గణాంక అధికారులు, వ్యవసాయ సహాయకులు ప్రాథమిక అంచనాదారులుగా ఉంటారని, బీమా, పంట నమోదు తదితర కార్యక్రమాలకు పంటకోత ప్రయోగాలు కీలకంగా మారతాయని చెప్పారు. ఉపగణాంక అధికారి రమణ, ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత



కుల పెద్దలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

ఆళ్లగడ్డ: పట్టణంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు శనివారం అడ్డుకున్నారు. సీడీపీఓ తేజేశ్వరి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బుడగజంగాల కాలనీలో 14 సంవత్సరాల బాలికకు వివాహం జరుపుతున్నారని సమాచారం రావడంతో శక్తి టీం సుబ్బలక్ష్మితో కలిసి కాలనీకి చేరుకొని వధువు, కుటుంబ సభ్యులతో పాటు కుల పెద్దలతో మాట్లాడి పెళ్లి నిలిపివేసేందుకు ఒప్పించారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే వధువు, వరుడి తల్లిదండ్రులు, పెళ్లి కుమారుడికి శిక్ష తప్పదని హెచ్చరించారు. అనంతరం వివాహం నిలిపివేస్తున్నట్లు ఇరువర్గాల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు.

బాల్య వివాహాలు.. భవితకు అవరోధాలు

బాల్య వివాహాలు భవితకు అవరోధాలు అవుతాయని సీడీపీఓ తేజేశ్వరి అన్నారు. మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం బాల్య వివాహాల నిరోధక చట్టం – 2006 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ శోభా వివేకవతి, బాల్య వివాహాల నివారణ కమిటీ సభ్యులు ఉన్నారు.

8న మౌలాలి స్వామి జార్తలు

శిరివెళ్ల: మండలంలోని కోటపాడు గ్రామంలో ఈనెల 8వ తేదీన మౌలాలి స్వామి జార్తలు జరగనున్నాయి. ఈ మేరకు రైతు సంఘం నాయకులు ఏర్పాట్లు చేశారు. మొహర్రం అనంతరం 11 రోజులకు జార్తలు జరపాలని నిర్ణయించారు. గ్రామంలో దాదాపు 17 ఏళ్ల తర్వాత గ్రామస్తులు ఏకమై కులాలకతీతంగా జార్తలు జరుపుకుంటున్నారు. సుబ్బరాయుడు, సోమన్న, ప్రతాప్ పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

నంద్యాల(సిటీ): పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని 16వ వార్డు కౌన్సిలర్ వాసగిరి విజయభాస్కర్ అన్నారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. వార్డ్ హెల్త్ సెక్రటరీ సుధారాణి, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేశారని శనివారం పోలీసులు తెలిపారు. వివరాలు.. రాణి మహారాణి థియేటర్ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో శివశంకర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడటంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రెండు రోజులు జైలుశిక్ష విధించారు.

అన్నదానం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ దివంగత పెసల శ్రీనివాసులు శెట్టి 72వ జయంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా హాజరై రోగులకు అన్నదానం చేశారు. పెసల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ల పేర్లతో సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి ఫోన్ పే ద్వారా సేవా రుసుము చెల్లించాలని ఫేక్ కాల్స్ చేస్తున్నారన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇలాంటి ఫేక్ కాల్స్ వచ్చాయన్నారు. ఇలా మున్సిపల్ అధికారులు ఎవరికీ ఫోన్లు చేయడం లేదని పేర్కొన్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): దూరవిద్య కేంద్రాలుగా బీఈడీ కాలేజీలు పని చేస్తున్నాయని, తరగతులు నిర్వహించని బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయుడు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శివకృష్ణయాదవ్, సురేష్‌బాబు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో బీఈడీ సర్టిఫికెట్ కోసం పక్క రాష్ట్రాల నుంచి విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. తరగతులు నిర్వహించకుండా ఒకే ఫ్యాకల్టీని మూడు నాలుగు కాలేజీలు చూపుతూ ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. రామకృష్ణ, ప్రవీణ్, గోపాల్, శేషాద్రి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు ప్రధాని బాధ్యత వహించాలి

మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని, కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. శనివారం హింసలేని సమాజం నిర్మిద్దాం అనే పేరుతో మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర నంద్యాలకు చేరుకుంది. గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఆమె దుయ్యబట్టారు. మహిళలకు కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. సత్యనారాయణమ్మ, భాను, అన్నమ్మ, షంషాద్, శమీమ్‌బేగ్ పాల్గొన్నారు.

శిశువు ఆరోగ్యానికి తల్లి పాలే కీలకం

నంద్యాలటౌన్: శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలే కీలకమని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అన్నారు. శనివారం నంద్యాల సర్వజన ఆసుపత్రిలో ఐఎంఏ మహిళా విభాగం, లయన్స్ క్లబ్ సంయుక్తంగా తల్లి పాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 200 మంది గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. డాక్టర్లు అరుణ జ్యోతి, నాగమణి, వసుధ, నర్మద, శిల్ప,పనీల్ పాల్గొన్నారు.





తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

ముమ్మరంగా రోడ్డు పనులు

శిరివెళ్ల: శిరివెళ్ల నుంచి రుద్రవరం మండలం వయా ఆళ్లగడ్డ మండలంలోని వ్యవసాయ పొలాలలో గ్రామీణ లింక్ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 13.7 కి.మీ. రోడ్డు పనులకు రెండేళ్ల కితం ప్రభుత్వం రూ.7.30 కోట్లు మంజూరు చేసింది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పనులను ప్రారంభించారు. శిరివెళ్ల, పేరూరు, చిలకలూరు, యర్రగుడిదిన్నె, చందలూరు, మందలూరు గ్రామాలను కలిపేందుకు చేపట్టిన రోడ్డు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. మొదట మెటల్ రోడ్డు పనులు పూర్తి కాగా ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు తుదిదశకు చేరుకున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి. పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ విజయకుమార్ మాట్లాడుతు రూ.7.30 కోట్లతో పీఎంజీఎస్‌వై కింద రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

నంద్యాల(సిటీ): నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేయాలని చెప్పారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణంలోని గాంధీ చౌక్‌లోని 1వ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకుండా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పలు జాగ్రత్తలు తీసుకుని పైప్‌లైన్ పనులు జరుగుతున్న ప్రాంతాలలో సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

జీవోలను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోట సీట్ల తగ్గింపును విరమించుకోవాలని 107, 108 జీవోలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మూడు కేటగిరీలుగా సీట్లను విభజించి 50శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎస్ఆర్ కేటగిరీలకు కేటాయించడం వల్ల ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 25సీట్లకు మాత్రమే రిజర్వేషన్ అమలు చేయడం సరికాదన్నారు.

సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

నంద్యాల(న్యూటౌన్): హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్టు, భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య విమర్శించారు. శనివారం స్థానిక కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ రక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ మోదీ.. సేవ్ ఇండియా పేరుతో ఈనెల 9న విజయవాడలో జరిగే కార్మిక మహాగర్జనలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిందితులను శిక్షించాలి

నంద్యాల(వ్యవసాయం): హర్యానా రాష్ట్రంలోని మేవాడ్‌లో హిందువులపై జరిగిన హత్యాకాండ నిందితులను శిక్షించాలని హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, పట్టణ అధ్యక్షుడు సల్లా రమేష్ కోరారు. శనివారం ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ముందుగా స్థానిక కాళికాంబ దేవస్థానం నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. హర్యానాలో బ్రిజ్ మండల్‌యాత్ర చేస్తున్న భక్తులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. నిమ్మకాయల సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, సత్యం, ఉపేంద్ర, బలరాం పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి జగనన్న భరోసా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు

నంద్యాల(అర్బన్): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందిస్తూ భరోసానిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు పేర్కొన్నారు. గతంలో 12 వైద్య కళాశాలలు ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఒక్కో వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.470కోట్ల వ్యయంతో 17 వైద్యకళాశాలల ఏర్పాటుకు అనుమతులు తెచ్చిన ఘనత ప్రభుత్వానిదేనన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఐదు వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం కావడం హర్షనీయమన్నారు. అందులో నంద్యాల వైద్య కళాశాల ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఆరేళ్ల తర్వాత ప్రతి ఏడాది ఒక్కో కళాశాల నుంచి 160 మంది డాక్టర్లు బయటకు వచ్చి స్థానికంగా సేవలు అందిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జనరల్ సెక్రటరీ ఆదిమూలపు సతీష్‌కుమార్, అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారెడ్డి, కడప ఇన్‌చార్జ్ ప్రతాపరెడ్డి, రఫీ పాల్గొన్నారు.

నిరుద్యోగుల కోసమే జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని, అందుకే ఈనెల 11న ఎస్‌పీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారని ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి, జిల్లా అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు కంపెనీల్లో పని చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా అధికారి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఐసీఐసీఐ బ్యాంకు, ఎవరిటోజన్ లైఫ్ సర్వీసు, శ్రీరామ్ చిట్స్ లిమిటెడ్, డిక్సన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ, ఎంఎస్ఏ మోటార్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఆయా కంపెనీల్లో పని చేయుటకు 18 – 30సం వత్సరాల్లోపు, ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు,రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 9440224291 నంబర్‌లో లేదా.. www.aprrdc.inలో సంప్రదించాలని కోరా రు. కార్యక్రమంలో నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, బెక్కెం నాగేశ్వరరెడ్డి, ఏఈ సుబ్రహ్మణ్యం, సుబ్బన్న, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నంద్యాలకు ఖ్యాతి తేవాలి

విద్యారంగంలో నంద్యాలకు ఖ్యాతి తేవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వెలాసిటీ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రెండు సంవత్సరాల కాలంలోనే కళాశాలను స్థాపించి ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ఉత్తమ స్థాయిలో నిలవడం హర్షనీయమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్ఐఓ గురువయ్యశెట్టి, ప్రిన్సిపాల్, డైరెక్టర్ శ్రీనివాసరావు, మాధవీలత, ఆర్ఏఆర్ఎస్ ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు, మహానంది దేవస్థానం చైర్మన్ పాలం మహేశ్వరరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం



మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ప్రతి గడపలో సంక్షేమ పథకాల వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ రమణతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? జగనన్న పాలన పట్ల మీరు సంతోషంగా ఉన్నారా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్‌చైర్మన్ పాంశావలి, నాయకులు బాబురావు, తిరుపతయ్య, అంకాలయ్య, రామకృష్ణారెడ్డి, జాకీర్‌హుసేన్, రామకృష్ణారెడ్డి, పుల్లమ్మ, ప్రసాద్‌రెడ్డి, వెంకటస్వామి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, శివ, గోరే, సోమశేఖర్, చెన్నప్ప, ముర్తుజా,బాబు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నంద్యాల(అర్బన్): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్ల పట్టాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. పట్టణంలోని నూనెపల్లె జాతీయ రహదారికి ఇరువైపులనున్న నిర్వాసితులకు శనివారం ఆర్‌డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవితో కలిసి ఇళ్ల పట్టాలను పంపిణీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, సునీత అమృతరాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, అనిల్ అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రుద్రవరం: మండలంలోని ఆర్ నాగులవరం గ్రామానికి చెందిన సొదరదిన్నె నరసింహులు అనారోగ్యంతో మృతి చెందాడు.దీంతో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచ్ గంధం సావిత్రమ్మ శనివారం మృతదేహానికి నివాళులర్పించి మృతుడి భార్య రవణమ్మకు రూ.5వేల నగదు అందజేశారు.ఉప సర్పంచ్ సింహం, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): స్థానిక రెవెన్యూ క్వార్టర్స్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను జేసీఎస్ జిల్లా కన్వీనర్ సన్నల సాయిరాంరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వ పెద్ద పీట వేసిందన్నారు. మాతా శిశుమరణాల తగ్గింపునకు, తల్లుల ఆరోగ్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త చెన్నమ్మ, గర్భిణులు పాల్గొన్నారు.